తెగినగాలిపటం

చలమయ్య మేష్టారి అల్లుడు రైలుకింద తలపెట్టాడు —ఈ వార్త ఊరంతా పాకిపోయింది. చాలమంది నోటివెంబడి "మేష్టారి కూతురు సుఖపడిందిలే" అన్నమాటలు వచ్చినయ్.

అతనిశవం చూసిన మేష్టారు చలించలేదు. సావిత్రి ఆ సమయంలో వూర్లోలేదు. ఆమె వచ్చేసరికి తండ్రి పరిస్థితి యేమీ బాగులేదు.

ఊర్లో చిన్నాపెద్దా మేష్టారి ఇంటిచుట్టూ మూగారు. అల్లుడు చనిపోయాడని పలుకరించడానికి కాదు— ఇంతజ్ఞాని— ఇలా అయిపోయారేమని ఓదార్చడానికి!

మనిషోలా అనుకున్నారు. "వాడు బ్రతికి ఆ కూతుర్ని యేం సుఖపెట్టాడు. తన నేం హాయిగా బ్రతకనిచ్చాడు? ఆ చచ్చినవాడైనా యేం సుఖపడ్డాడు?"

"అల్లుడు చచ్చాడంటే మేష్టారు పీడాపోయిందన్నారే —గుండెనిబ్బరం లేనివాళ్ళమీద—చేతకాక పౌరుషం హెచ్చయి రైలుకింద తలపెట్టినవాళ్ళమీద చలమయ్యమేష్టారు సానుభూతి చూపించారే! అలాంటిది సాయంత్రింసరికి మతి తప్పినవారిలా అయారేం?"

"అసలు—ఆ సావిత్రికిలేని దుఃఖం ఈయనకెందుకూ అని?"

వచ్చేవారు చెప్పినవిధంగా చెప్తున్నారు. ఎప్పుడూ కన్నీరు చూడనివాళ్ళు మేష్టారి కంటివెంబడి నీరు కారటంతో చాలామంది కళ్ళునులుపుకొని వెళ్ళిపోతున్నారు!

"మీారే చావుబ్రతుకులు గురించి యెంతచెప్పేవారు? —అలాంటిది ఈ సమయంలో గుండెధైర్యం లేకుండావుంటే ఆ అమ్మాయి యెలా వుంటుంది?"— సలహా చెప్పేవాళ్ళు చెప్తున్నారు!

మేష్టారు అందరిసలహాలు వింటూవింటూనే కళ్ళవెంబడి నీరు బొటబొటా కారిపోతోంది. రెండు రోజులైంది నిద్రాహారాలు లేవు. ఎవరితోనూ చివరికి కూతురుతోనైనా మాటాడలేదు. కారణం? ఏ ఒక్కరికీ యీా ప్రశ్నకి జవాబు దొరకలేదు.

* * * * *

చలమయ్యమేష్టారి పుట్టుక పెరగడం వుద్యోగంబొబ్బిలిలోనే. బొబ్బిలి హైస్కూల్‌లో తెలుగుపండితులు. స్వయంకృషివలన బయటికివచ్చి వూర్లో అందరిచే గౌరవింపబడుచున్నారు. ఆ గౌరవం సర్వకాలాల్లోనూ చెక్కు చెదరకుండా నిలబెట్టుకొనేటట్లు మెసలుతూ వచ్చారు.

మేష్టారికి ముప్పయ్యేళ్ళ ప్రాయంలో భార్యగతించింది. అప్పటికి ఒకే ఒక సంతానం సావిత్రి— ఆరేళ్ళ పిల్ల. ఆయనమీాద నున్న అభిమానంతో వూర్లోవారందరూ డబ్బుసహాయం చేస్తామని మళ్ళీ పెళ్ళి చేసుకోమన్నారు. అందుకు ఆయన అంగీకరించక ఆ కూతురును చూచుకొనే పవిత్రంగా

బ్రతికారు. సావిత్రి ఏపుగా అందంగా పెరుగుతూ ఆ వయసులో సాధారణంగా చూపించని తెలివితేటలు చూపించటంతో మేష్టారు యెంతో మురిసిపోయేవారు. పెళ్ళియీడు వచ్చింది. తల్లిపోయాక తనే తల్లి అయ్యాడేమో తనచేతులతో యింత చేసాక యింకోయింటికి పంపించడానికి యెంత ప్రయత్నించినా మమకారాన్ని చంపుకోలేకపోయారు. "ఆడపిల్లకు అత్తవారిల్లు శాశ్వతం కానీ, నా కెవరున్నారు? అమ్మాయి వెళ్ళిపోతే నేను ఇంట్లో వుండగలనా? అమ్మాయిని విడిచి బ్రతుకలేనని" ఒకసారి, మళ్ళీ యింకొకసారి 'నా పిచ్చిగానీ! ఆడపిల్లకి పెండ్లి శోభస్కరం కదా - పెళ్ళి చేస్తే అమ్మాయిమాత్రం మొగుణ్ని విడిచి ఉండగలదా నాయనా? ఉంటే నెలా రెండునెలలూ—నా తల్లి నా కంటికి కనపడాలన్న స్వార్థంతో వాళ్ళ సుఖం చంపడం నాకు భావ్యమా? అన్నిటికీ దొడ్డవాడొకడున్నాడు. ఈ నాటకంలో మనపాత్రి ఎంత వుత్తమంగా నిర్వహించామని అనుకోవడమేగానీ— ఏమిటో మనిషిఅంతా స్వంతం అనుకొని బ్రతకటంకన్న తెలివి తక్కువ ఇంకొకటి లేదు."

ఈ మాటలు తన శిష్యుల్లో ఒకడైన రామారావుతో ఆ రోజుల్లో చెప్పుకున్నారు. రామారావుతండ్రి పల్లెనుంచి తెచ్చి మేష్టారికి పదేళ్ళ కుర్రాణ్ణి అప్పచెప్పారు. మేష్టారి అదుపాజ్ఞల్లో పెరుగుతూ పెద్దవాడై ప్రస్తుతం రామారావు ఆంధ్రా యూనివర్శిటీలో చదువుకుంటున్నాడు.

ఇలా బాధపడుతూనే సంబంధాలు చూసేవారు. తన మనసులో కోరికే ఫలించింది.

సావిత్రి పెళ్ళి ఒకానొక మంచిముహూర్తాన అయిపోయింది. మేష్టారి సంతోషం పట్టలేనంతదైపోయి కన్నీరు కారింది. ఆనందరావు నిజంగా ఆనందరావే. ఆయన యే విషయమైనా చాలా తేలికగా తీసుకుంటాడని యెల్లప్పుడు సరదాగా ఉండే మనిషని చాలామంది అనుకున్నారు. మనిషి అందగాడనే చెప్పాలి. మాటలుతీరు చాలా ఆర్భాటం అనిపించినా మర్యాదగల మనిషిగానేకనిపించాడు.

సావిత్రి అందమైన మొగుణ్ని అందులో ఇల్లరికం వచ్చిన మొగుణ్ని కట్టుకొని సుఖిస్తుందని అందరూ అనుకున్నారు. మేష్టారు యీ అల్లుణ్ని యెలా కలుసుకున్నదీ రామారావుతో చెప్పారు. సాలూరు ఒక స్నేహితుని ఇంటికి వెళ్ళారట. ఆయన ఎగ్రికల్చర్ డిమాన్‌స్ట్రేటరు. ఆ రోజునే బదిలీమీద వచ్చిన ఆనందరావు చలాకీ చూచి ముచ్చటపడి నాలుగువిషయాలు కనుక్కొని ఎగ్రికల్చర్ మేస్త్రీ ఐతేనేం? బొబ్బిలి బదిలీ చెయ్యిస్తానని తన స్నేహితుడు హామీ ఇచ్చాడు— ఇంట్లో ఉండడానికి ఒప్పుకున్నాడు— ముందు వెనుకా యెవరూలేరు. భగవంతుడు ఈ నాటికి అనుగ్రహించాడని పెండ్లి నిశ్చయించాశారుట.

ఎవరూలేరా? ప్రశ్నించాడు. రామారావు కడుపులో ఉన్నప్పుడే తండ్రి పోయాడట! తల్లి రెండేళ్ళక్రితం పోయిందట!

చాలాడబ్బు సంపాదించే పోయాడట! కూర్చునితింటేకొండలు తరిగిపోవా నాయనా? ఆస్థిపాస్తులు లేకపోయినా ఏదో ఉద్యోగంచేసుకుంటున్నాడు. కుటుంబాన్ని పోషించుకో లేడా? అన్నారు.

బొబ్బిలి అల్లుణ్ణి వెంటనే బదిలీ చేయించుకున్నారు. తొలిసారి మేష్టారు అల్లుడితో చెప్పవలసిన పరిస్థితి ఎప్పుడు వచ్చిందంటే— ఆయనకళ్ళతో అల్లుడు ఒకనాడు ఊరుబయట ఎవరో భామతో సరసల్లాపాలు ఆడటం చూసాక!

ఆనందరావు నిజస్వరూపం చాలా వేగిరంగానే బయట పడిపోయింది. తను తెచ్చుకున్నది ఇప్పుడు తన ఖర్చులకే చాలదు. మేష్టారు అడగకుండా వుండలేకపోయారు. మొదట మౌనం వహించినతరువాత "ఇల్లరికం నిన్ను పోషించడానికి వచ్చాననుకున్నావా? నన్ను నువ్వు పోషించా" లన్నాడు. ఇలాంటికటువుమాటలు ఇదివరకు వినని మేష్టారు ఒకరోజంతా భోజనం చెయ్యలేకపోయారు. ఒకనాడు మొగుడూ పెళ్ళాల కేం వచ్చిందోమేష్టారుచూస్తుండగానే చెప్పుతీసి సావిత్రిని కొట్టే పళ్ళలోనుంచి రక్తంకారటం మేష్టారుచూచి అక్కడనుంచివెళ్ళి పోయి రాత్రితొమ్మిది దాటాకగానీ యింటికిరాలేదు. మళ్ళా అల్లునితోయిది నాయనా అదినాయనా అంటూ యీ విషయం ఆ విషయం మాట్లాడేవారు. కానీ వాడు వినిపించుకొనే వాడు కాదు——వినిపించుకున్నా చివరికి ఈ వెఱ్ఱి వేదాంతాలన్నీ నా కెందుకూ? అని అక్కడనించి వెళ్ళిపోయేవాడు.

క్రొత్తగా ఒక ఆఫీసరు వచ్చాడు. ఎక్కడికో వెళ్ళ మన్నాడట—నే వెళ్లనన్నాడట—అది మనసులో పెట్టుకొని ఒక నాడు సంచితో రికార్డు మోసుకొని వెళ్ళమంటే యేదో గలాభా జరిగింది. తను చేస్తున్న ఉద్యోగం చిన్నదైనా తన వ్యక్తిత్వానికితగ్గపని చెప్పమన్నాడు. ఒక వారంరోజుల్లోనే కల హం పెరిగిపోయింది. మాటామాటా వచ్చి ఆ ఆఫీసర్ని చెంప పెట్టు తగిలించడానికి వురికితే గుమస్తా అడ్డుపడ్డాడు. మేష్టారి ముఖంచూసి ఉద్యోగం తీసేసేబదులు యేజన్సీ ప్రాంతాలకి బదిలీ చేయించాడు. రెండు రోజులు వూరుకొని యేంనాయనా యిలా చేసావని మేష్టారు అల్లుణ్ణి అడిగితే కోపంగా "నన్ను మీా గులాంనిచేస్తే నేను మీాయింట్లో వుంటానా? నీ అసరా చూసుకొని నీ కూతురు నన్ను మొగుడిలా చూడటం లేదే! బదిలీ చేయించుకోడానికే వాడికి గట్టిగా తగిలించబోయాను— ఇప్పుడు నీ కూతురు నాతోరాదూ?"

మేష్టారు "పోనీ యీా వూర్లోనే వేరేగా వుండలేక పోయావా నాయనా? అమ్మాయి నువ్వూ కంటికి కనిపించే వారు."

నవ్వేసి "పిచ్చి — ఎందుకొచ్చిన మమకారాలు హాయిగా బ్రతకడం మీారిద్దరూ నేర్చుకోలేదు"—అన్నాడు.

మేష్టారు కూతుర్ని చూసి నాలుక కదలనిచ్చేవారు కారు. తనకెటువంటి గౌరవం వుండకపోయినా అల్లుడనే మమ కారం చంపుక తినేది. అది చంపుకోవాలని ప్రయత్నించినా

కూతురు బ్రతుకేమవుతుందనే భయంచేత చాలా నెమ్మదిగా వుండేవారు.

ఒకనాడు యెంతో ఆప్యాయంగా "అంత శెలవుంది— కొన్నాళ్లు యిక్కడేవుండు నాయనా" అంటే వెంటనే తన పెళ్లాన్ని పంపించితీరాలని పెట్టె పరుపూ సర్దడం మొదలు పెట్టాడు. మేష్టారు చివరికి "నీక్కావలసింది అంతేగా. నే నెవర్ని పంపించకపోవడానికి? నీ పెళ్లాన్ని నువ్వు తీసుకపో నాయనా!"

ఆ మాట అన్నారు. తన కళ్ళల్లో నీరు నింపకూడదను కున్నారు. ఇంటినుంచి కదులుతున్న కూతురు మౌనంగా మమ కారాన్నంతా కన్నీరుగా వలకబోస్తుంటే నాలుగడుగులైనా ముందుకు పడలేదు.

గదిలో కూలబడిన మేష్టారు తనకు తెలిసినంతమట్టుకు తొలిసారిగ విలపించారు. భార్య పోయినప్పుడైనా యిలా కాలేదు. పెళ్లాం తనను ఏదేదో ప్రశ్నించినట్లు తనుకూడ ఆమెకు దరిదాపుల్లో చేరినట్లూ భ్రమించుతూ పెల్లుబికిన దుఃఖ ముతో తనలో తనే పిచ్చివాసిలా మాట్లాడుకున్నారు. "నా సావిత్రిమ్మకు సత్యవంతుడ్ని తెస్తాననుకున్నాను— తెచ్చానను కున్నాను. కానీ...కానీ......"

ఎంతో సేపటికిగానీ యీ చీకటిపోయి తెలతెలవారే ఉషఃకాంతులు మనసులోనికి అలుముకోలేదు. కుదుటపడిన మనసు ఏకాంతంనుంచి బయటపడడానికి ఆలోచించింది. ప్రకృతి

వుదయించిన దగ్గరనుంచి పడిన కోట్లకొలది వాన జల్లులలోని ఒక బిందువు తను? ఎండిపోయిన ఇసుకపై బడితేలాభంఏముంది? ఒకచెరువులోనో ఒక బీటలుదేరిన పొలములోనో—లేక సుక్తి లోనో...పడితే ఈ జన్మ తరిస్తుంది. ఈ తలపులు తనమీదనే జాలిని పుట్టించాయి. చిన్నవవ్వునవ్వి "యేమిటో ఈ సంబంధాలు ఎందుకో ఈ అభిమానాలు. తెలివితక్కువ చేత మా అల్లుడ్ని మాపిస్తున్నాగాని వాడు నాలాంటి మనిషే. కాని దుర్బలుడు; అలాంటి వానిమీద కోపం అసహ్యం చూపించి బేలనవుతానా? మా అమ్మాయిమీది అభిమానం యీనాడు లేకపొతే రేపైనా నాతల్లి మంచితనముచూచి కలగదా?"

సావిత్రి జీవితం పాలకొండలో మరీదుర్భరమైంది. ఎన్ని హింసలుపెట్టినా మౌనంతోనే భరిస్తూ తను తండ్రికి ఒకవుత్తరమైనా వ్రాయడానికి వీలులేదన్న భర్తఆజ్ఞ అక్షరాలా మనస్ఫూర్తిగా పాటిస్తోంది. తండ్రి ఉత్తరాల మీద ఉత్తరాలు వ్రాస్తున్నా ఏదీ భార్యకు చూపించకుండా అడపాతడపాజవాబులిస్తున్నాడు.

ఒకనాటిరాత్రి ఆనందరావు ఎవరిదగ్గరనుంచో పుస్తకం తెచ్చాడు. కథలో రచయిత ప్రతి ఆడదానికి ఇంకో మగాడిమీద వుంటుందిగానీ సంఘంలో కట్టుబాట్లకి జడిసి ఆ కోరికను మనసులోనే వుంచుకుంటుందని వ్రాశాడు. అది చదివి పెళ్ళాన్ని బలవంతం చేశాడు నీకింకే మగాడిమీద వుందో చెప్పమని. చాల సేపటివరకు ఆమె ఊరుకుంది. కాని ఏదో అంటేనే

గాని తను అక్కడ వుండలేని పరిస్థితివచ్చి నాకెవరిమీదాలేదంది.

"నా మీదలేదని నాకు తెలుసులే. ఆ ఇంకోమగా డెవడో చెప్పు" మన్నాడు.

సావిత్రి ఒక చెంపపెట్టు పడేవరకు చలించలేదు. ఏడ్చే బదులు నవ్వింది. ఆ నవ్వుచూసి గది బయటకు తోసేస్తుంటే ఇంటావిడ కలుగజేసుకుంది. వాళ్ళింతో కయ్యానికి దిగగానేఆమె ఊరుకుంది. పైనదోమలు చలిఆ చీరకొంగుకప్పుకొని తెల్లవారే వరకు అలానే కూర్చొంది. ఉదయం తలుపు తెరచేసరికి సావిత్రి మామూలుగా గదిలోనికి వెళ్ళబోతుంటే "నా అసలైనపెళ్ళం అయ్యుంటే నామనసు అర్థంచేసుకొనే యుందువు. నన్ను తలుపు తీయమని బ్రతిమాలేదానవు. నీ మనసు ఇంకెవరిమీదోలగ్నం అయివుంటుంది. అంచేతనే ఇంట్లో ముంగిలా వుంటావు.'

ఈ మాటలన్నీ నలుగురికీ వినపడాలి—తనుచేసినపనులు నలుగురికి తెలియాలని ఆనందరావుకు ఉబలాటం హెచ్చు. సావిత్రికి అంతాగుట్టే.

మాష్టారుకు వరసగా రెండురోజులు అమ్మాయి కలలో కనబడింది. ఒకరోజు విచారంగా ఉన్నట్లు మరుచటిరోజు నన్ను మరచిపో నాన్నా అని ఏడుస్తున్నట్లూ—ఏదో జరిగివుంటుందని నిల్చున్నపాటున బయలుదేరేముందు అల్లుడువ్రాసిన ఉత్తరం అందింది.

"మీ అమ్మాయి నాకు మీపేరుపెట్టి భయపెట్టాలని చూస్తోంది. పీకపట్టుకొని నూతివరకు తోసుకవెళ్ళి పడ్తావా

లేదా అని అన్నానేగాని మళ్ళీ భార్య అని ఇంటికి తీసుకవచ్చి ఆమె చేతతోనే ఆమె మెడకే రిబ్బను కట్టించాను. ఎందుకు? నన్ను ఎదిరించినవాళ్ళకు ఉరిశిక్ష విధించి న్యాయంచేకూర్చాలి"

మేష్టారి కాళ్ళు విరిగిపోయినా పరుగెత్తుకవెళ్ళినట్లు పాల కొండ వెళ్లారు. కూతుర్ని ప్రాణంతో చూడగానే సగంపోయిన ప్రాణం తిరిగివచ్చింది. తల నిమురుతూనే వచ్చేదుఃఖాన్ని ఆపు కుంటూ "నాతల్లీ...నాతల్లీ...ఇంకనోరు పెగలలేదు. కూతురు కాస్సేపటికి చిరునవ్వుతో "నాకేంనాన్నా హాయిగానేఉన్నాను."

భార్యమాటలకు ఆనందరావు వెక్కిరించాడు. "సంతో షంగా వుండటం సత్యం ఆడటం మీ అమ్మాయికి తెలియద" న్నాడు. అంతేకాకుండా తన ప్రతాపం మామగార్కి బాహా టంగా తెలియ పర్చాడు. మనసులో తనకూతురు ఇంత బాధ ఏలా వోర్చిందని గింజుకున్నా పైకి ఏమీ అనలేదు. ఆశ్చ ర్యం ఏమంటే ఆనందరావు ఒకనెలరోజులపాటు చిక్కిపోయిన పెళ్లాన్ని కన్నవారింటికి పంపడానికి ఒప్పుకున్నాడు.

సావిత్రికి కన్నవారింటికి వెళ్ళడం ఇష్టం లేకపోయినా తండ్రి బలవంతానికితోడు భర్త కూడా మంచిమాటలు ఆడటం మొదలుపెట్టాడు. ఈలోగానే తనే వచ్చి మళ్ళీ తీసుకవెళ్తా నన్నాడు.

అనుకున్నట్లు ఆనందరావు నెలరోజుల్లోగానే బొబ్బిలి వచ్చాడు. ఈ సారి తిరిగి వెళ్ళే అవసరం లేకపోయింది. ఇంటి పొరుగుననేయున్న ఓ క్రొత్తకోడలితో సరసం భోజనం చెయ్య

బోయాడు. ఫలితం ఆవూర్లోనేకాదు చుట్టుపట్ల ఎక్కడా నిలవ టానికి వీలు లేకిపోయింది. ఆ అమ్మాయి తనవైపు వోర చూపులు చూసేదని అంచేతి తను యిలా చేయబోయానని అన గానే వీపుగూడా చదునైంది.

వచ్చిన నాలుగురోజులు ఏగొడవా లేదు. ఒళ్లుగట్టిపడ్డాక సావిత్రివైపు ఒకనాటిరాత్రి చూస్తూ చూస్తూ "నువ్వుచాలా మంచిదానవు" అన్నాడు. ఆమె ఒకసారి తలయెత్తి చూసింది. హారికేన్ లాంతరు వెలుగులో ఆమె ఇన్నాళ్లు మనసులో వూహించుకున్న మొగుడు కనిపించాడు. "నువ్వువుంటేఉద్యో గం ఊడేదికాదు. దెబ్బలు తినేవాడ్నికాదు—"

"హూ" అంది ఆశ్చర్యంగా సావిత్రి.

"నాకు అబద్ధం ఆడటం తెలియదు. నిన్ను ఎందుకు పంపించాననుకున్నావు..."

మౌనం సావిత్రిని కొంతసేపు మిగింగివేసింది. ఈసారి పెగిలిన గొంతుకలో ఆవేదనా విచారం మిళితమై "నా బ్రతుకు నేను వేరేగా బ్రతుకుతున్నాననే ఆశైనా లేకుండా చేశారు."

"మీనాన్న కోరిక నీకోరిక నెరవేరిందిగా! మళ్ళీ ఇల్లరి కం వచ్చాను."

"నా కోరిక ఎప్పుడూ లేదు."

జవాబులేదు. ఆ మరుచటిరోజు ప్రశాంతంగానే గడి చింది. నిజం మేష్టారుతోను చెప్పాడు. ఆయన విచారించలేదు. మనసు కుదుటపడితే చిన్న వుద్యోగం సంపాదించవచ్చని.

ఇక ఊరువెంబడి పడ్డాడు. పదిహేనురోజుల్లో చాలా గొడవలు జరిగాయి. ఒకగొడవ చాలా తీవ్రరూపం దాల్చింది. తను ఒక ప్రముఖ పోషలిష్టని అవినీతిని పూర్తిగాయెదుర్కొనే వీరుడని సంఘసేవే తన జీవితలక్ష్యమని నలుగురితో చెప్పటం మొదలుపెట్టాడు. అవినీతిని బయట పెట్టే కార్యక్రమంలో మొదటిమెట్టుగా గోడమీద కాగితములు అంటించడం మొదలు పెట్టాడు. ఎవడో ఏదో చేస్తున్నాడని—ఇంకో ప్రముఖ వర్తకుడు ఫలానా ఆఫీసరుకు యిన్నివేలు లంచం ఇచ్చాడనీ—ఫలానా ఆఫీసరు పెళ్లానికి ఇంకో ప్రియుడు ఉన్నాడని!

ఇంత బాహాటం కాగానే ఊరంతాగుసగుసలు బయలు దేరాయి. ఆ ఫలానావారు మేష్టారు కోసం కబురు పంపించ వలసివచ్చింది. ఆయన తిరిగివచ్చి అల్లుడ్ని ప్రశ్నిస్తే "నేను వ్రాసింది అబద్ధం అని నిరూపించండి. మీరుకూడా సత్యానికి దూరమైపోతున్నారు. వీళ్ళందరి అవినీతిని ప్రజలముందు పెట్టి వీళ్ళకు మంచినీరు పుట్టకుండా చేస్తాను" అన్నాడు.

మేష్టారు చాలా చెప్పినా ప్రయోజనం లేకపోయింది. అల్లుడితో వాదించటానికి యిష్టపడక ఊరుకున్నారు. ఆ వారం రోజుల్లో ఒకరోజు రాత్రి తన కార్యక్రమం కొనసాగిస్తుంటే కొందరు గుమిగూడి శుభ్రంగా వీపు చదునుచేశారు. ముడుకు మీద చెయ్యిమీద చిన్న దెబ్బతగిలి రక్తం కొద్దిగా కారు తోంది. ఇంటికి వచ్చాడు. తనకోపం పూర్తిగా మామమీద చూపించాడు. డాక్టరు సర్టిఫికేటు తీసుకొని పోలీసులకు ఫిర్యాదు

చేస్తావా లేదా అని కూర్చున్నాడు. మేష్టారు మాటాడలేదు. మామకు తెలియకుండా ఏపనీ జరగదని—మళ్ళీ యీ యింటి ముఖం చూడనని వెళ్ళిపోయాడు— చీకటిలో కలిసిపోయాడు.

మేష్టారు అలా నిల్చుండిపోయారు. సావిత్రి రెండడుగులు ముందుకువేసి తండ్రివైపు చూసి నిల్చుండి పోయింది. రెండురోజులు యెక్కడికీ కదలలేదు. మళ్ళీ ఆయన యే సర్దారణకు వచ్చారో యేమో మామూల్గా బడికి వెళ్ళేవారు.

కొన్నాళ్ళు గడచాయి. మేష్టారి వుత్తరం చూసుకొని ఒకనాటి మధ్యాహ్నానికి విశాఖపట్నం నుంచి రామారావు వచ్చాడు. తన బాధల్నీ సంతోషాన్నీ రామారావుకు చెప్తూ కున్నారు మేష్టారు. సాయంత్రంవరకూ, అల్లుడు వెళ్ళిపోయే వరకు జరిగిన సంగతి వివరంగా చెప్పారు. సాయంత్రం యిద్దరు షికారుకు బయలుదేరారు. మూడు ఫర్లాంగులు దూరాన్న ఉన్న రైలురోడ్డు దగ్గరకు వెళ్ళి ఆ దగ్గరగా యెత్తుగా ఉన్న మర్రిచెట్టు మొదట్లో కూర్చున్నారు.

మేష్టారు ఒకకార్డు రామారావుచేతికి ఇచ్చారు. అది అల్లుడు వ్రాసిందే. అందులో యేంవుందంటే సావిత్రినిజస్వరూపం తాను తెలుసుకున్నానని—దానికి మొగుడంటే యేమాత్రం అభిమానం వున్నా ఆ రాత్రే తనవెంట పరుగెత్తేదని—ఇలాంటిస్త్రీని తను ఇక సంస్కరించడానికి పూనుకుంటానని వ్రాసాడు. తరవాత తనశిష్యుల్లో ఇద్దరికి వ్రాసిన కార్డులు రెండు యిచ్చారు. "మేష్టారి ఇంట్లో స్టూడెంట్సు కరవా? అందులో

సావిత్రికి మొగుడంటే అసహ్యం! ఏమైనా జరుగుతుంది!"
రామారావుకు బ్రహ్మాండమంత కోపంవచ్చి ఏదో ఏదో అనేసాడు. మేష్టారికీ తనలా కోపం వచ్చిందనుకున్నాడు. గానీ రాలేదు.

"ఇప్పుడు నిన్నెందుకు పిలిపించానంటే"......అని ఆగిపోయారు మేష్టారు. మళ్ళీ అన్నారు "వాడిని తిట్టడానికి నే పిలువలేదు. నాతోనువ్వూ ఖర్గపురం రావాలి."

కాస్సేపు ఆలోచించాక సరే అన్నాడు. లేచిపోతూ "వెళ్ళకపోదును కానీ వాడేదో అమ్మాయికి ఉత్తరం వ్రాసినట్లుంది. అప్పటినుంచీ అక్కడికి తీసుకవెళ్ళివిడిచిపెట్టమంటోంది మనం వెళ్ళి వాడిపరిస్థితి చూశాకా ఆలోచిద్దాం" అన్నారు.

ఇద్దరూ ఖర్గపురం వెళ్లాక ఒకపూట తిరిగాక ఆనంద రావు జాడ తెలిసింది. ఒక మారుమూలలోవున్న ఆ కొంప— ఆకొంపలో వుంది ముప్పయ్యేళ్ళభామ—నోటిలోఖిల్లీ—పెదాలకు లిప్‌స్టిక్ వ్రాసినట్లుంది. ఎర్రటి జాకెట్టు, వేలాడేజూకాలు —చిన్న బెంగాలీముడి— మట్టిరంగు చీరకట్టి కొత్తాపాతా, ఉత్తరదక్షిణపు సంస్కారం కలిసిన మనిషిలా అగుపించింది. ఆమె గంభీరంగా మాటాడుతుంటే శక్తి వుత్పత్తి అవుతున్నట్లుంది గుమ్మంలో చాపవేసి కూర్చోబెట్టింది. మేష్టారు మాటాడలేదు. రామారావు ఆమె అడిగిన ప్రశ్నలకు జవాబుచెప్పాడు.

"మీరా ఓడంటున్నారు. నాకొక్కర్తే ఉండేది. అది చచ్చి పోయిందని చెప్పాడే! మరెవరూ నేరన్నాడు."

ఇద్దరూ ఆథాటీకి మాటాడటానికి పిరికివాళ్ళయ్యారు. ఆమెఅంది "మీాకు యింకెవరో! ఈయన వస్తాడుసూద్దురుగాని —సాలమంచిమనిషి—ఒక్కోసారి కోపం వస్తాది—ఆ సెణం లోనే సిన్నపిల్లాడిలా అయిపోతాడు—ఏడ్చుకుంటాడు ఆడదాని లాగ—మళ్లామరోసెనానికి పెద్దపులే—ఆయన దగ్గర కోపం ఎంతుందో కనికారం అంతుంది—సెడ్డెంతుందో మంచంతవుంది —మాదొడ్డమనిషి!"

ఇంతలో పొరుగు పిల్లాడిచేత తెప్పించిన'చా'నీరు మెదర పెట్టి బలవంతంచేసింది. మేష్టారు తాగలేదు. రామారావు తాగుతుంటే "ఆయనకి ఖర్చుకి డబ్బు యిచ్చేస్తే యింకేం గొడవ వుండదు. గొడవసేసినా నాకేంటో నానోఅమ్మలా అయి పోతాను. అప్పుడు కొట్టినా నవ్వుతాను—తిట్టినా నవ్వుతాను. కొడ్తాడు, తిడ్తాడు, తరవాత ఆయనే ముద్దిస్తాడు. అప్పుడు అస లైన మొగుడునాగ వుంటాడు."

ఆమె ఇదంతా చెప్పడానికి యేమాత్రం మొగమాట పడలేదు. ఆమె యెంత బజారుమనిషైనా యేదో సావిత్రిలో లేనిది ఈమెదగ్గర వుందనిపించింది. అందుకే ఆనందరావుయీామె దగ్గర వుండగలిగి యీామెచే దొడ్డ మనిషనిపించుకున్నాడని సైకాలజీ స్టూడెంటు రామారావు అనుకున్నాడు.

ఆనందరావు వచ్చాడు— తుపాను వచ్చినట్లయింది. మేష్టారుగానీ రామారావుగానీ యేమాటా అనటానికి అవకాశం

యీాయలేదు. నానాదుర్భాషలాడాడు. కూతురుని ఇంట్లోపెట్టు కొని వ్యాపారం చేస్తున్నావన్నాడు. న్యాయాన్ని నీతిని సమ ర్థించని బిరకారాయుడువన్నాడు. ఈ మనిషి తన కూతురు కంటే యెన్నో రెట్లు నయమని యిది తనకూతుర్ని పోషిస్తుందని అన్నాడు. మేష్టారు దైన్యంగా "ముందుగతి ఆలోచించు నాయనా" అన్నాడు.

"నాకేమిటి ఒకరి అదుపాజ్ఞలో ఉండే అవసరం నాకేం వుంది?"

కోపం కక్కుతుంటే మేష్టారు సాంతంగా "అవును నాయనా! తెగిన గాలిపటంలా స్వేచ్ఛగా విహరిస్తానంటావు. కానీ ఆ తెగిన గాలిపటం ఎంతసేపు గగనమార్గాన వుంటుంది? మనిషైపుట్టాక యెవరో ఒకరి అదుపాజ్ఞల్లోనో అథవా తన యొక్క సభ్యత్వానికైనా కట్టుబడకపోతే—యెదురయ్యేది వినాశం!"

ఆనందరావు విరగబడి నవ్వుతూ "ఇది బడికాదు పంతులూ! వచ్చినతోవనే పోతావా లేదా?" ముఖంచూసి మాటాడమన్నాడు రామారావు. ఇద్దరూ లేచేవరకూ వెంట తగుల్తూ మేష్టారు ముఖంమీాద తుప్పున ఉమ్మేశాడు. ఇద్దరు నడుస్తున్నారు. వాడు అంటున్న మాటలు యింకా వినిపిస్తు న్నాయ్. వినబడకపోయినా చెవులో గింగురు మంటున్నాయ్. మేష్టారు ఒకమాటైనా ఆడలేదు. రైలు ఎక్కారు. మేష్టారు నిముషానికి ఒకవిధంగా అగుపిస్తున్నారు. అగ్నిపర్వతం తనలో

ఉద్భవించిందని ఒక క్షణం—మరో క్షణం మహా సముద్రపు లోతుల్లోని నిశ్చలత్వం తనని యెటువంటి గాబరా పొందకుండా చేస్తోందని అనుకున్నాడు శిష్యుడు.

ఆయన మెల్లీతరబడి ట్రైలు వచ్చినా మాటాడలేదు. కొంతసేపు హాలాహలాన్ని చిరునగవుతో మ్రింగిన గరళకంఠు నిలా మరో క్షణానికి శ్మశానవాకిటిలో భీభత్సంగా నాట్యం చేస్తున్న పరమశివునిలా అగుపించారు.

దిగేటప్పుడు "నాయనా!" అన్నారు. పెద్ద నిట్టూర్చారు. నడచి ఇంటికి వెళ్తున్నారు. మళ్ళీ "నాయనా" అన్నారు. "అమ్మాయి అడిగితే యేంచెప్పను?"

చీకటిలో సమాధానం దొరక్క—గింజుకుంటుంటే రామారావుని గట్టిగా పట్టుకొని వలవల యేడ్చేశారు.

"మేష్టారూ!" అన్నాడు యేదో ఆదరిం యేదో అభిమానం—చెప్పలేని బాధ అన్నీ ఒక్కసారిగా ప్రజ్వరిల్లాయి.

శిష్యుడు మరింకేమీ మాటాడలేదు. చీకటిలో యిద్దరూ మెల్లగా నడచి ఒంటిగావున్న యిల్లు చేరుకున్నారు. మేష్టారు సావిత్రివైపు చూడలేదు. జవాబు వాళ్ళ ముఖాల్లో నే గ్రహించిన సావిత్రి యేప్రశ్నా వేయలేదు.

ఒకరోజు... రెండురోజులు...వారం... నెల... గడిచిపోతున్నాయ్. అల్లుని దగ్గరనుంచి వచ్చిన ఒక్క ఉత్తరం కూతురుకు చూపించలేదు. తనూ చదవలేదు. రెండో వుత్తరం చింపనూలేదు. మరి వుత్తరాలూ లేవు. ఎవరైనా కూతురు గుణ

గణాలుపొగిడి అల్లుని దూషిస్తే "నాకు కూతురు లేదు నా కొడుకు సావిత్రి!" అనేవారు మాష్టారు. దుఃఖంతో మానంతో కృంగిపోయి కృశించిపోతున్న సావిత్రి ఒంటరిగా కూర్చొని తనలో తనే నవ్వుకుంటోంది. అప్పుడప్పుడూ తనలో తనే యేవేవో మాటాడుకుంటుంది. మేష్టారు కూతురు పరిస్థితి చూసి ...రోజుకు రోజూ తనలో తనకు తెలియకుండానే ద్వేషం రగులుకుంటోంది......ఒకనాటిరాత్రి తనకు నిద్దరపట్టలేదు. కూతురు నడిరాత్రిమీద లోపలి వసారాలో చీకటిలోనేయిటూ అటూ పచారుచేస్తూ యేవో మాటలుఅంటోంది. "దెయ్యాలు భూతాలు రాకుండా రక్షిస్తున్నాను యీ యింటికి"—మేష్టారు కూతురు అంటున్న మాటలు వినగానే నడుం విరిగినట్లయింది. అయినా తమాయించుకొని లేచి "చాలా రాత్రియింది పడుకో అమ్మా" అన్నారు.

సావిత్రి తండ్రివైపు చూస్తూ "నాన్నా! ఆయన యే మయ్యారో...ఉత్తరమైనా రాలేదు! నన్ను ఆయనదగ్గరవిడిచి పెట్టరూ!" అలా నిల్చోనే యేడ్చేస్తోంది. కొద్దిక్షణాల్లో మళ్ళీ పకపక నవ్వుతూ "నేను మీ కొడుకునుకదూ?ఇక్కడేఉంటాను. ఏ భూతాలనుంచీ మీకు ఆపదరాకుండా చూస్తుంటాను."

తెల్లవారేవరకూ యిద్దరికి నిద్దరలేదు. పగలల్లా కూతురు పనిపాట్లు యేదో చేసుకపోతోంది. ఒక మూగమనిషిలా ప్రపంచంతో తనకేం సంబంధంలేనట్లుగా పోతోంది. ఇరుగుపొరుగంటూ ఎవరూలేరు. ఒకచిన్నతోటలో వూరిచివర మేష్టారు

ఇల్లువుంది. రైళ్ళకూత, పిట్టల అరుపులూ వినిపిస్తుంటాయ్.

సావిత్రి పరిస్థితి రాను రాను అధ్వాన్నం అయిపోతోంది. మనోవ్యాధితోపాటు యేదో జబ్బు ఆవరించినట్లుంది. మేష్టారు కూతురుని చూసినప్పుడూ, తలచినప్పుడూ అల్లుడు యెదరగా ప్రత్యక్షమౌతున్నాడు. తను అల్లునిమీద రాతిబండ వేసినట్లు, తుపాకి పేల్చినట్లు ఇంకా రకరకాల క్షణికమైన ఆలోచనలు తిరిగినా యెంతో సేపటికిగానీ మళ్ళీ తన మామూల్మాలు ధోరణికి రాలేకపోతున్నారు.

చంద్రికళలు మారిపోతున్నాయ్. పున్నమ మళ్ళీఅమావాస్య. మళ్ళీ వేసవివచ్చింది. ఒక సంవత్సరం దాటినా ఆనందరావు జాడ తెలియదు. తెలుసుకోవాలని మేష్టారు ప్రయత్నించలేదు... కానీ యేదోవిధంగా యింట్లోవున్న యిద్దరికీ అంటిపెట్టుకున్నట్లే వున్నాడు.

మేష్టారి విధవచెల్లెలు రాజమండ్రిలో వుంది. సావిత్రి పరిస్థితి బాగులేదని తెలిసి చూడటానికి వచ్చి యీ జబ్బుబాగు చేయిస్తానని సావిత్రిని తీసుకవెళ్ళింది. మేష్టారు కాదనలేదు. స్థలం మారిస్తే కూతురు మానసికంగా కొంత కోలుకుంటుందని అనుకున్నారు.

సావిత్రి రాజమండ్రివెళ్లి నెలరోజులు పూర్తి కాలేదు గానీ మేష్టారు ఇక్కడ మానసికంగా బాధపడుతున్నారు. ప్రతి క్షణం కూతురుగురించి ఆలోచనలే! చెల్లెలు జాగ్రత్త తీసుకుంటుందనే విశ్వాసంవున్నా యిల్లంతా చీకటైయైనట్లుంది. ఒకసారి చూసైనా వద్దామనే కోర్కెతో జయలుదేరి వెళ్ళాడు.

తిరిగి వచ్చినప్పటికి రాత్రి పదిగంటలైంది. తలుపుతీసి హరికేన్‌లాంతరు వెలిగించారు. కాళ్ళూచేతులూ కడుక్కొన్నాక పరుపు వేసుకున్నారు. కూతురుగురించి ఆలోచిస్తూనే పక్కవాల్చారు. కూతురు చిన్ననాటినుంచీ జరిగిన సంఘటనలన్నీ తరంగాలులా తలపుకు వస్తున్నాయ్. గుండె చివుక్కుమంది. ఈలోకంలో తనకేదైతే ప్రియాతిప్రియమైనదో దానిని ఒక హంతకునికి చేతులారా అప్పగించాననుకున్నాడు. పాముకు పాలుపోసి పెంచటం పులినిఇంట్లో పెట్టుకోవటం ఎంత తెలివితక్కువో?తను అల్లుడ్ని ఇంట్లో పెట్టుకొని తెలివి తక్కువవాడి నయ్యాననుకున్నాడు. తనకూతురి పరిస్థితి యీలావచ్చింది. తన సర్వస్వాన్ని కొల్లగొట్టినవాడు......రాత్రి పదకొండు దాటిపోయింది.

ఈ ఆలోచనలో అల్లునిమీద యీర్ష్య లోలోనమండుచున్న అగ్నిపర్వతంలా అయిపోయింది. తలుపుతట్టిన చప్పుడు—మొదట వినిపించలేదు. రానురాను చప్పుడు వుండివుండి వినిపించింది. ఎవరూ అని లోనుంచే అరిచారు. జవాబులేదు. మళ్ళీ తలుపు చప్పుడయింది. లేచి లాంతరు పట్టుకొని గుమ్మం దగ్గరకు వెళ్ళి "ఎవరూ?" తలుపు తీసారు.

"నువ్వా?" వేస్టారు ఒక్క అరుపు అరచారు.

అల్లుడు తలదించి నిలుచున్నాడు. అగ్నిపర్వతం బ్రద్దలైంది. గాలిపటం తెగిపోయింది. కోపం శరీరాన్నంతటినీ పైకి ఎత్తి వేసింది; గజగజ వణకించేసింది. తన స్వాధీనంలో లేని తన

మనసు...అవయవాలు...చేతిలోని లాంతరును అల్లునిమీదకు విసిరేశాయ్.

ఆనందరావు అంతర్థానమయ్యాడు. చీకటిలో మేష్టారు తలుపు ధాం మని వేస్తూ పరుపుమీదకు చెంగున గంతువేసి కూలబడిపోయారు. అంతే ... తెల్లావారి లేచేసరికి వార్త వచ్చింది...అల్లుడు రైలుకిగింద తలపెట్టాడని...ఆహాఅన్నారు ...అంతే! ఎందుకు ఆత్మహత్య చేసుకున్నదీ యిః కెవరికీ తెలియలేదు.

పదిగంటలప్పుడు తిరిగి వస్తుంటే తపాలా బంటోతు యెదురై "మూడురోజులై వుత్తరం వచ్చింది. కిటికీలోనుంచి గదిలోనికి వెయ్యటానికి ప్రియత్నించానుగానీ వీలయిందికాదు" అంటూ కవరు అందిచ్చాడు. ఇంటికి వచ్చాక చదవకూడదనుకుంటూనే చదివితే గుండె బెణికింది. పట్టుతప్పిన మనిషి అయిపోయారు.

మేష్టారి పరిస్థితి మిత్రునిద్వారా విన్న రామారావు బొబ్బిలివచ్చాడు. పగలు పదిగంటలకు వచ్చినదగ్గరనుంచీమేష్టారి దగ్గరనే కూర్చొనివున్నాడు. ఆయన యేమీ మాటాడలేదు ఈలోగా చాలామంది వచ్చి వెళ్ళిపోతున్నారు. ఆయన వైఖరి చూస్తూంటే బహుశః కొద్దిగా మతి చెడిందేమో ననిపించింది. ఇంత నీరసంగా తననెప్పుడూ చూడలేదు.

హోటలుకు వెళ్ళి భోజనం చేసి వచ్చాడు. మేష్టారి ప్రక్కనే చాపవేసుకున్నాడు. రాత్రి తొమ్మిదిదాటింది. చీకటి

రాత్రి ఒకసారి రైలుకూత వినిపించింది. మేష్టారు గతుక్కు మన్నారు.

పదిగంటలైంది. సావిత్రి పెరటిగదిలో కూర్చొనివుండ టం గుమ్మంద్వారా కనిపిస్తోంది. బెడ్ లైటు వెలుగులో ఆమె ఒక్కొక్కసారి లేచి ఇటూఅటూ తిరుగుతోంది. కొంతసేప య్యాక రామారావుకు ఆమె ఆడుచున్న మాటలు వినిపిస్తు న్నాయ్. "మీరు ఎంత మంచివారు...మీరంటే నాకు అంత వెఱ్ఱి యెందుకుండేది? మీ అంత మంచివారు లోకంలో వున్నారా? మీరు చచ్చిపోయారని వారంతా అంటున్నారు? నిజంగానే...లేదులేదు...మీరు చావలేదు... మీరు బ్రతికే వున్నారు...ముమ్మాటికీ..."

రానురాను ఆమె గొంతుక పట్టుకపోయింది. కళ్ళల్లోనీరు కారిపోతోంది...."పోనీలెండి. ఒకసారివచ్చి నాతో మాటా డరూ?...మాటాడరూ?"

సావిత్రి అలా అంటూనే మంచంమీద సొలిపోయింది ఈ మాటలు వింటూ ఈపరిస్థితి తిలకించిన రామారావుకళ్ళల్లో నీళ్ళుతిరిగాయ్. నిశ్శబ్దంలోఆమె తీస్తున్న యెగవూపిరి యిక్కడికి వినిపిస్తోంది. అప్రయత్నంగా "అయ్యో! పాపం!"అన్నాడు.

* * * * *

మేష్టారు "నాయనా!" అన్నారు. శిష్యునిఒళ్ళు ఒక్క సారిగా పులకరించింది. ఏం మాటలు వస్తాయోఅని ఆతృతలో యెదురుచూశాడు.

"నాయనా! సావిత్రినిగూర్చి విచారిస్తున్నావా? వద్దు నాయనా—తండ్రి, నాపని నేను చేశాను. అది ఆమె కర్మ! నేను అంచేతనే విచారించలేదు."

శిష్యుడు ఆశ్చర్యంగా యీబాధ అంతా దేని కన్నట్లు చూశాడు.

వెనువెంటనే మేష్టారుఅన్నారు "నాగురించి విచారించు నాయనా...నాగురించి...విచారించు..."

ఇంతలో ఆయన కళ్ళల్లోనుంచి నీరు గిరగిర తిరిగి, జల జలా వ్రాలటంచూసి చప్పున వగ్గరకు వొచ్చాడు. కళ్ళు ఒత్తు కోకుండానే "ఇదిగో...యీ ఉత్తరం చదువు నేనెందు కిలా అయ్యానో అర్థం అవుతుంది!"

హరికేన్‌లాంతరు దగ్గరగా జరిగి రామారావు వుత్తరం తనలో చదువుకోవటం మొదలుపెట్టాడు!

"మహారాజశ్రీ మామగార్కి నమస్కారములు.

ఈవుత్తరం చదవకండా చింపాలన్నంత కోపం మీకు వస్తుంది. కానీ ఒక్కసారైనా చదవమని మిమ్మల్ని ప్రార్థిస్తు న్నాను. నేను చేసిన పనులకు మీలాంటి వుత్తములు, మీ కూతురులాంటి పతివ్రిత యెన్ని బాధలు పడ్డారో తెలుసు కున్నది యీమధ్యనే! నేను యెందుకిలా అయ్యానో నాకే అర్థం కాకుండావుంది. నేను బహుశః కల్లుతాగినవాడిలా అయ్యుం టాను. నాలోని చెడుగునే సింహాసనం ఎక్కించాను. నా గురించి మీకు చాలా తెలుసునని విచారనుకోవచ్చు కానీ

మీకు నా గురించి అధికం తెలియదని మీయిల్లు చేరేముందు మీయిల్లు విడిచిపెట్టాక విషయాలు పూర్తిగా తెలియవని అవే వ్రాసుకుంటున్నాను. నేను కొన్నాళ్లు మనిషిని యెందుకు కాలేదో నాకిప్పుడు అర్థమైంది.

మానాన్న గతించిపోయారు. మాఅమ్మ ముద్దుచేత సరియైన అదుపాజ్ఞలలో ఉంచలేదు. చిన్నతనంనుంచీ నాదే పెద్దరికం; నాకు కూడిన చెడ్డసహవాసందే పెద్దరికం అంటే సబబుగా ఉంటుంది. నేను మా అమ్మచావుకి కారణంఅయ్యానేమో అనిపిస్తుంది. నేనెలా బ్రతుకుతాననే బాధతో యెల్లప్పుడూ ఉండేది. ఆమె పోయేసరికి మిగిలింది నేను—యెందుకూ కొరగాని నా ఉద్యోగం! నాకు కష్టాలనేవి యెలాఉంటాయో మీయిల్లు విడిచిపెట్టాకగానీ తెలియలేదు.

మీయిల్లు విడిచిపెట్టాక కొన్నాళ్లు యెలాంటి తిరుగుళ్ళు తిరిగానో మీకు తెలుసు. ఖర్గపురంలో డబ్బుకోసం నన్ను దేవునిలా చూచిన ఆమెనుకూడా మోసగించాను. జీవితంలో ఆమె ఒకేసారి ఆదిశక్తియై నన్ను త్రొక్కివేసి ప్రాణాలతో ప్రాణం విడిచిపెట్టనిచ్చింది. కడుపుకోసం నెలలకొద్దీ బాధపడ్డాను. ఆకలంటే యేమిటో నాకు తెలిసింది. రిక్షాలు లాగాను. బస్తాలు, బుట్టలూ మోశాను. రోడ్లు తుడిచాను. చింకిబట్టలతో చలికీ యెండకీ లోనై నాలానేబాధపడే యెందరిమధ్యనో తిరిగాను. ఈ బాధలు పడి,యెదుటివాళ్ళ బాధలుకళ్ళారా చూడటంవల్ల నా కరుడుగట్టినహృదయం... సూర్యరస్మి తగిలినమంచులా అయిపో

యింది. రాహువు విడిచిన సూర్యునిలా...నాలో అసలైన వెలుగు ప్రకాశించింది... ఈ హృదయంతో నేను జరిగిన రోజులు తలంచాను; చూచాను. నేనుయెంత చెడ్డవాడినో తెలుసు కున్నాను.

మళ్ళీ ఇన్నాళ్ళకి నాలో మీమీదనున్న గౌరవం. విశ్వాసం భక్తి మీదగ్గరకు రానిస్తోంది. నావిషయమై సావిత్రి ఫలవరిస్తూ పిచ్చిమనిషి అయ్యుంటుందని నాకుతోస్తోంది. ఆమె పరిస్థితిచూసి మీరు బేజారెత్తి నేనంటే పరమశతృత్వం వహించివుంటారు. కానీ నాలోని విశ్వాసం నన్ను మీరు ఉదారులని, నాపాతజీవితాన్ని మరచి గౌరవించి ఆదరిస్తారని మళ్ళీ మీదగ్గరకు చేరనిస్తోంది. ఇటువంటి ఆశను నిరాశచేస్తే నాకీ లోకంలో నిలవటానికి చోటు లేదు— నేను భగ్నహృదయుడనై యేమౌతానో చెప్పలేను.

మీ అల్లుడు

ఆనందరావు''

పరిస్థితి గ్రహించిన రామారావు ఒక నిట్టూర్పు విడిచాడు. మేష్టారిదగ్గరగా వస్తుంటే మళ్ళీదీనస్వరంతో ''నాయనా! ఊరంతా నేనేదో అయిపోయానని నాకు నీతులు చెప్తున్నారు. నేనేమీకా లేదు—చలమయ్యనే. కానీఇదివరకు చలమయ్యలా సంఘంలో ఒక గౌరవమైనస్థానాన్ని అలంకరించడానికి తగినవాడిని కాను...''

మేష్టారిదుఃఖం పొంగిపోవటంవల్ల మాట్లాడలేకపోయారు. కొంతసేపయ్యాకా నేలవేపు దృష్టి ఆనుస్తూ "నా వేదుపు నా గురించే..."

పరుపుమీద చేరబడ్డారు. ఉండిఉండిఆయనముఖంముడుచుకపోతోంది. అంతటిలో ఆయన బెక్కుతూ కన్నీరు కారుస్తుంటే రామారావు ఆయనను తాకి ఓదార్చబోయాడు.

ఆయన కళ్ళు తుడుచుకుంటూ "నాయనా! లోకంలో యెందరో యెన్నో చెడ్డపనులు చేస్తారు. నాఅల్లుడూ చేశాడు. వాడి పనులవల్ల మేం మానసికంగా బాధపడ్డాం. అంతే—కానీ ఇన్ని చెడ్డపనులుచేసి ఎవరినీ ఖూనీ చెయ్యలేదు. కానీ నేనో—లోకమంతా నన్ను మంచివాడనని గౌరవిస్తుంది—కానీ ఒక్క నిముషంలో వచ్చిన కోపంతో బ్రతుకుమీద గంపెడాశతో వచ్చిన ఒక మంచివాని ప్రాణాన్ని తీశాను...నేను ఖూనీకోర్ని —నాకీ సంఘంలో స్థానంలేదు..."

నిశ్శబ్దం చీకటితోపాటు ఆవరించింది. ఎంతసేపటికో చలమయ్యమేష్టారి మాటలు వినిపించాయ్. "తెగిన గాలిపటం ఆకాశాన యెంతసేపు వుంటుంది?"

ఈమాటలు ఆయన పలవరిస్తున్నారో లేక తెలివితో అంటున్నారో తెలుసుకోలేని రామారావు కిటికీగుండా చీకటిలోనికి చూసాడు. రైలుకూత వినిపించింది భీకరంగా!

—:సమాప్తం:—